క్లుప్తంగా

రేపు బీఆర్ఎస్ సమావేశం

ఇల్లెందు: ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ 25వ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 15న ఇల్లెందులో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కోరారు. ఆదివారం ఇల్లెందులో మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కృష్ణారావుకి 'అంబేడ్కర్' పురస్కారం

పాల్వంచ: స్థానిక డీఏవీ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు ఎంఎస్‌వీ కృష్ణారావుకి అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదివారం గుంటూరు ఆంధ్రా క్రిస్టియన కళాశాలలో సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కృష్ణారావుకు పురస్కారాన్ని అందజేశారు.

చైర్మన్ పదవి గిరిజనులకు కేటాయించండి..

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ పదవి గిరిజనులకు కేటాయించాలని సేవాలాల్ సేన జిల్లా జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. జగన్నాథపురం గ్రామంలో ఆదివారం సేవాలాల్ సేన మండల కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ అధికారులు పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని గిరిజనేతరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు.

యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

ఇల్లెందు: అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లాంటి లక్ష్యాలతో ఉపాధ్యాయులందరినీ ఏకతాటి మీదకు తీసుకొచ్చి అనేక పోరాటాలు నిర్వహించిన టీఎస్‌యూటీఎఫ్ ఎప్పటికీ ఉపాధ్యాయుల పక్షమేనని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.జయరాజు అన్నారు. ఆదివారం టీఎస్‌టీయూఎఫ్ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఇల్లెందులోని సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇతర ఉపాధ్యాయ సంఘాల కంటే పోరాటంలో టీఎస్‌టీయూఎఫ్ అగ్రభాగాన ఉంటుందన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడాలి

పాల్వంచ: సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటాల్లో కార్మికులు ఐక్యంగా కలిసి నడవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో హమాలీ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ... పనిప్రాంతాల్లో కార్మికవర్గం వివక్షకు గురవుతోందన్నారు. ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అనంతరం పట్టణంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

కోరం పుల్లయ్యకు నివాళి

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య సంవత్సరం క్రితం మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం కోయగూడెం గ్రామంలో సంవత్సరీకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరై పుల్లయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, డీసీసీబీ బ్యాంక్ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రజిని, దేవా, రెడ్యానాయక్ తదితరులు ఉన్నారు.

పునాదుల్లోనే ఇందిరమ్మ ఇళ్లు

పేదల సొంతింటి కల నెరవేరుస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పనులు, అధికారుల ప్రోత్సాహం మందకొడిగా సాగుతోంది. ఫలితంగా తొలి విడతలో ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి అంతంతగానే ఉంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న అవరోధాలను పరిష్కరించడంలో అధికారులు ఇంకా తాత్సారం చేస్తే నిర్మాణాల పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

- ఉచిత ఇసుకపై స్పందించని అధికారులు
- అధిక ధరలకు కొనలేక అరకొరగా నిర్మాణాలు
- పెరిగిన సామగ్రి ధరలతో ఆందోళనలో లబ్ధిదారులు
- ఉన్న ఇళ్లు తొలగించి గుడారాల్లో ఆదివాసీల అవస్థలు


పునాది దశలో నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలివిడతలో మండలంలోని పూబెల్లి గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. గ్రామంలో సమగ్రంగా సర్వే చేసి 85 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. ఆయా ఇళ్లకు మార్చి 16న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు గ్రామానికి వచ్చి ప్రోత్సహించడంతో లబ్ధిదారులు నిర్మాణ పనులను అంతే వేగంగా ప్రారంభించారు.

పునాది దాటని నిర్మాణాలు..

ఇందిరమ్మ పథకంలో మొదటి విడత ఎంపిక చేసిన గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. పూబెల్లి గ్రామంలోని లబ్ధిదారులు ఉన్న ఇళ్లను తొలగించి పక్కనే గుడారాలు, రేకులతో చిన్నపాటి షెడ్లు నిర్మించుకున్నారు. కుటుంబ సభ్యులే స్వయంగా గుంతలు తవ్వుకొని తొలి దశ పనులను పూర్తి చేశారు. ఆ తరువాత వారికి సమస్యగా మారింది. గ్రామంలో 85 ఇళ్లు మంజూరవ్వగా ఇప్పటి వరకు కేవలం ఏడు నిర్మాణాలు మాత్రమే పునాది దశకు చేరుకున్నాయి. మరో 38 పునాది గుంతల దగ్గరే నిలిచిపోయాయి.

ఉచిత ఇసుకపై మౌనమేల..?

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణాపై నూతన పాలసీని ప్రకటించింది. ఇందులో అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కూపన్ల ద్వారా ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో గత నెలలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కూపన్ల ద్వారా ఇసుకను సరఫరా చేసింది. కానీ తాజాగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయానికి వచ్చే సరికి క్షేత్రస్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు ఎక్కడా స్పందన లేదు. కనీసం ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు ఇసుకను ఎలా సేకరిస్తున్నారన్న ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం.

ఇసుక ధరలకు రెక్కలు...

ఇందిరమ్మ పథకంలో భాగంగా పునాది నిర్మాణం కోసం గుంతలు తవ్వుకున్న లబ్ధిదారులు అనంతరం చేపట్టాల్సిన కాంక్రీట్ పనులకు ఇసుక సేకరణ ప్రధాన సమస్యగా మారింది. ఇసుకకు డిమాండ్ పెరగడంతో దళారులు ధర పెంచేశారు. స్థానికంగా అటవీ ప్రాంతం నుంచి సేకరిస్తున్న లోకల్ ఇసుక సైతం ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3వేలుగా, టేకులపల్లి, గుండాల మండలాలలో వాగుల నుంచి సేకరించిన ఇసుక ధరను రూ.4వేలుగా, ఇక నాణ్యమైన గోదావరి ఇసుక ధరను ట్రాక్టర్‌కు రూ.5,500 నిర్ణయించి సరఫరా చేస్తున్నారు.

నిర్మాణాల పురోగతిపై ప్రభావం...

గృహ నిర్మాణశాఖ తాజా నిబంధనల ప్రకారం లబ్ధిదారుడు తన స్థలంలో కందకాలు తీసి బేస్‌మెంట్ వరకు సొంత ఖర్చులతో పూర్తి చేసుకోవాలి. బేస్‌మెంట్ పూర్తయితే రూ.లక్ష లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది.

కానీ అధిక ధరకు ఇసుక కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణం కోసం వ్యయం భారీగా పెరుగుతుందన్న ఆందోళన నెలకొంది. ఇప్పటి వరకు పూబెల్లి గ్రామంలో ఒక్కరు మాత్రమే ఇసుకను కొనుగోలు చేసి నిర్మాణాలు కొనసాగించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇదే అదునుగా నిర్మాణంలో కీలక పాత్ర పోషించే సిమెంటు, కంకర ధరలకు కూడా రెక్కలు వస్తున్నాయని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక ధరలకు భయపడి..



పునాది దశ వరకు గుంతలు తవ్వుకున్నాం. స్థానికంగా కొనలేని స్థాయిలో ఇసుక ధరలు పెరిగాయి. అంత వెచ్చించే ఆర్థిక స్థోమత మాకు లేదు. అందువల్లే పనులు నిలిపివేశాం. రోడ్డు పనుల మాదిరిగా ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక పథకం వర్తింపజేయాలి.

– మాడె రాంబాబు, ఇందిరమ్మ పథకం లబ్ధిదారుడు, పూబెల్లి

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక రవాణా చేయాలని ప్రభుత్వం సూచించింది. అందుకు అనుగుణంగా మొదటి విడతలో ఎంపికైన గ్రామాలకు ఉచితంగా ఇసుక రవాణా చేసేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. పేదల సొంతింటి కల నిజం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

– జి.శంకర్, పీడీ, హౌసింగ్,

సమ్మర్ క్యాంపు నిర్వహించండి..


జీఎంకు సమస్యలు వివరిస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఏరియా ప్రాంత కార్మికులు, కార్మికేతర పిల్లలకు సమ్మర్ క్యాంపు నిర్వహించాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజును ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ కోరారు. అదేవిధంగా సత్తుపల్లిలోని పీవీఎన్ఆర్ కాలనీలో కూడా మొదటిసారి సమ్మర్ కోచింగ్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సంవత్సరం కాలంలో నాలుగు గోడల మధ్య పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షల అనంతరం వారికి కొంత ఆటవిడుపు కోసం ప్రతీ సంవత్సరం యాజమాన్యం సమ్మర్ కోచింగ్‌ను ఏర్పాటు చేస్తుందని, అదేవిధంగా ఈసారి కూడా ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా.. కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి కాలనీలో గతవారం తాళం వేసిన ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించారని కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన జీఎం కార్పొరేట్ అధికారులతో చర్చించి ఏర్పాటు చేయిస్తామన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్


చుంచుపల్లి: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పాల్వంచరూరల్: నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో పయనించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. నాగారం గ్రామంలోని రేపల్లెవాడలో అంబేడ్కర్ జ్ఞాన వారసులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఐపీఎస్, ఐఏఎస్‌లు కావాలన్నారు. తాను కూడా అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేడు ఐపీఎస్‌ను సాధించినట్లు చెప్పారు. రెండు గ్రామాల ప్రజలు కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సతీష్‌కుమార్, సీఐ సతీష్, గంగపురి శ్రీను, రాయల భాస్కర్, తోకల లింగయ్య, గంగపురి దుర్గ, చంటి, సిద్ధుల గణేష్, సుధీర్, తోకల ప్రసాద్, దుర్గాప్రసాద్, ప్రేమ్‌కుమార్, రాజు, శ్రీకాంత్, కల్యాణ్, సీతారాములు, సృజన్, వీరబాబు, ఏసుబాబు, బత్తుల శ్రీనివాస్, దామోదర్, పగిళ్ల కృష్ణయ్య, రంగస్వామి, బీరవల్లి జయభాస్కర్, రాందాస్‌నాయక్, శనగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ..

చుంచుపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొత్తగూడెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. హాజరైన తెలంగాణ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీవీకే మనోహర్, చింతలచెరువు శ్రీను, సలీం, గుమలాపురం సత్యనారాయణ, నరేంద్రబాబు, కుమార్ నాయక్, గాంధీ నాయక్ పాల్గొన్నారు.

స్తూపావిష్కరణ సభను జయప్రదం చేయండి..

ఇల్లెందురూరల్: ఈ నెల 15న బయ్యారం మండలంలో నిర్వహిస్తున్న ముక్తార్ పాషా స్మారక స్తూపావిష్కరణ బహిరంగ సభను జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ నాయకుడు తోడేటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు రొంపేడు గ్రామంలో ప్రచార పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ముక్తార్ పాషా పోరాటాలను భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్న ఆకాంక్షతో స్మారక స్తూపాన్ని నిర్మించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో వెంపల్లి వెంకన్న, ధనుంజయ, లక్ష్మీనారాయణ, శ్రవణ్, పృథ్వీ, నాగరాజు, భద్రయ్య, ప్రతాప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: మంగళవారం కొత్తపేట గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా స్తూపావిష్కరణ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్యా హర్ష్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. భూక్యా నర్సింగ్, ఎట్టి నరసింహారావు, గుగులోత్ రామచంద్, బోడా మంచ, నోముల భానుచందర్, తోటకూరి సతీష్, బాలు, శ్రీను పాల్గొన్నారు.

పద్మశ్రీ రామయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): కోటిన్నర మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడిన, స్థానికులకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందజేసి అకాల మృతి చెందిన వనజీవి రామయ్యకు ఆదివారం రామవరంలో పలుచోట్ల మొక్కలు నాటి కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ... ప్రపంచానికి పచ్చదనాన్ని అందించటానికి తన జీవితాన్ని త్యాగం చేశారని, కోట్లాది గింజలను వృక్షాలుగా మలిచి, ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే గౌస్, కే.రాజశేఖర్, మాధవీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: కోటిన్నర మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల ఆరోగ్య జీవన యాత్ర వాకర్స్ ఆదివారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జూలూరుపాడులో రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వేల్పుల బోసు, తిప్పర్తి శివ, బానోత్ నవీన్ రాథోడ్, వందనపు కమలాకర్, ఉసికల భాస్కర్, యలబాక వెంకటేశ్వర్లు, వేల్పుల నరసింహారావు, ముదిగొండ వెంకటప్పయ్య, వి గురునాథం, కొండా వెంకటేశ్వర్లు, పెండ్యాల నరేష్, ఎస్కే బుడేన్, నాగేశ్వరరావు, శంకర్‌రావు, ఎం నరసింహారావు పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ ఆత్మీయ సమ్మేళనం


పుల్లయ్య-వెంకమ్మ మూడు తరాల కుటుంబ సభ్యులు

జూలూరుపాడు: ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కాలక్రమేణా అంతరించిపోతున్న రోజుల్లో జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ ఢిల్లీ వెంకటేశ్వర్లు తన కుటుంబానికి చెందిన మూడు తరాల వారసులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఢిల్లీ పుల్లయ్య-వెంకమ్మ వంశవృక్షమైన ఢిల్లీ గోపయ్య, కృష్ణవేణి దంపతులు, ఢిల్లీ రామయ్య, పద్మావతి దంపతులు, ఢిల్లీ వెంకటేశ్వర్లు, సీతమ్మ దంపతులకు చెందిన మూడు తరాల వారంతా ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ సుమారు 100 మంది కుటుంబసభ్యులను ఒకేచోట కలుసుకున్నారు. రోజంతా మామిడితోటలో ఆడుతూపాడుతూ గడిపారు. కుటుంబసభ్యులందరూ ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, యోగక్షేమాలు, పిల్లల చదువులు, చిన్ననాటి సంఘటనలు, పెద్దల పరిచయాలు, గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

ఇల్లెందు: అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఇల్లెందు అగ్నిమాపక శాఖ అధికారి నవీన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఇల్లెందు ఫైర్ సర్వీస్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రభాను, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు.

సింగరేణిలో ముగిసిన రాత పరీక్షలు


పర్యవేక్షిస్తున్న జీఎం నికోలస్


సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మహిళా కళాశాలలో ఆదివారం బయోకెమిస్ట్ – 1, జమేదార్ 26 (ఇంటర్నల్) పోస్టులకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బయోకెమిస్ట్ – 1 పోస్టుకు 9 మంది, జమేదార్ 26 (ఇంటర్నల్) పోస్టులకు 70 మంది హాజరయ్యారు. ఈ పరీక్ష సెంటర్లను సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం నికోలస్ పరీక్ష సెంటర్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... ఈ పరీక్ష ఫలితాలు ఈరోజు రాత్రి సింగరేణి ప్రధాన కార్యాలయం నోటీస్ బోర్డ్‌లో అదేవిధంగా సింగరేణి వెబ్‌సైట్‌లో ఉంచుతామని, అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

బొగ్గుగుట్టను కాపాడుకుందాం..

ఇల్లెందు: పూసపల్లి ఓసీ, కేటీసీ ఫిట్-3, వీకే-7 ఓసీ, సత్తుపల్లి ఓసీ-3లకు పూర్తి స్థాయి అనుమతులు వెంటనే తీసుకురావాలని, సింగరేణి సంస్థ ద్వారా బొగ్గు వెలికి తీయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందు జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో నూతన ప్రాజెక్టుల వేగం పెంచాలని కోరారు. సింగరేణిలో ఖాళీ స్థలాలు కాజేయటానికి విశ్వప్రయత్నాలు జరుతున్నట్లు చెప్పారు. సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీ సొంత ఇంటి కల నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరాజ్ అహ్మద్, టి.కృష్ణ, అబ్బాస్, రఘు, రామ్, బరోస్, మోహన్, కిరణ్, సురేష్, రాజమొగిలి, సోమ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎండ నుంచి ఉపశమనం


సింగరేణి ఉమెన్స్ కాలేజీ సమీపంలో తాటి ముంజల అమ్మకం



కొత్తగూడెంటౌన్: భానుడు భగభగ మండుతున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. ప్రతీ ఏడాది కంటే ఈ సంవత్సరం మరింత ఎక్కువ పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయినా బయటికి వెళ్లి, దూరప్రాంతాలకు ప్రయాణం చేసి పనులు, ఉద్యోగాలు చేయక తప్పదు. ఈ క్రమంలో చాలామంది ఎండబారిన పడిన అనారోగ్యం పాలవుతారు. అయితే ప్రకృతిలో ప్రతి దానికీ ఓ విరుగుడు ఉంటుంది. అదే ముంజలు. ఎండలకు బయటకు వెళ్లే వాళ్లు ముంజలు తింటే చలవ అని, ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. ఈ క్రమంలో చిరువ్యాపారులు దూరప్రాంతాలను నుంచి తాటి ముంజలు తెచ్చి కొత్తగూడెం పట్టణంలో రోడ్ల వెంట చెట్ల కింద అమ్ముతున్నారు. పలువురు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఎండవేడిమి నుంచి ఉపశమనంగా తింటూ బాగున్నాయని కొందరు అక్కడే తింటే.. మరికొందరు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకెళ్తున్నారు. జిల్లా కేంద్ర కొత్తగూడెంలోని హెడ్డాఫీస్, పోస్టాఫీస్ ఏరియా, బస్టాండ్ ఏరియా, సూపర్ బజార్, రామవరం, రుద్రంపూర్, విద్యానగర్‌లతో పాటు పలు ప్రాంతాల చిరు వ్యాపారులు డజన్ రూ.80లకు తాటిముంజలను అమ్ముతున్నారు. ప్రజలు వాటిని కొని ఇష్టంగా తింటున్నారు.

లోక రక్షకుడికి జయజయ ధ్వానాలు

ఇల్లెందురూరల్: క్రైస్తవులు ఉపవాస దీక్షలు ప్రారంభించి 36 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుపుకునే జయప్రవేశ పండుగ (మట్టల ఆదివారం)ను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. 21పిట్ ఏరియా, మామిడిగూడెం, సుభాష్‌నగర్, బాలాజీనగర్, రొంపేడు, కొమరారం, పోలారం గ్రామాలలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఏసుక్రీస్తు ఒలీవ కొండల ప్రాంతంలో ఉపవాస దీక్షలు చేపట్టి జెరూషలేము నగరంలో ప్రవేశించిన సందర్భంగా అక్కడి ప్రజలు ఖర్జూర చెట్ల మట్టలను దారివెంట పరుస్తూ స్వాగతం పలికిన రోజును స్మరించుకుంటూ క్రైస్తవ కుటుంబాలు ఈత మట్టలతో ప్రదర్శన నిర్వహించారు.

పాల్వంచ: పట్టణంలోని చర్చిల్లో ఆదివారం మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధుల్లో ఈత మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. పాస్టర్లు చర్చిల్లో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. కేటీపీఎస్ కాలనీలోని సీఎస్ఐ, కాంట్రాక్టర్స్ కాలనీలోని ఎల్‌జీఎం చర్చి, గట్టాయిగూడెం విద్యుత్ కాలనీలోని క్రీస్తు సువార్త మందిరంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

జూలూరుపాడు: జూలూరుపాడు న్యూకాలనీ సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సామ్యేలు, క్రైస్తవులు ఈత కొమ్మలతో స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి చంద్రుగొండ క్రాస్ రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి కమిటీ సెక్రటరీ గత్తం కాంతారావు, ట్రెజరర్ ఇల్లంగి రాంబాబు, యూత్ సెక్రటరీ కాశిమల్ల కిరణ్, ఇల్లంగి దేవసహాయం, జి.అబ్రహం, బుడిపూడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో..

జూలూరుపాడు ఆర్‌సీఎం చర్చి (నిర్మల మాతా దేవాలయం) ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ బందనాథం శౌరీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు


పాల్వంచ: పట్టణంలో ర్యాలీ


జూలూరుపాడు: సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ